ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 Global

https://epaper.eyyaltynews.in/

మంగళవారం 15 సెప్టెంబర్ 2026


## యువతకు గుడ్ న్యూస్..

### నవంబర్ 19 నుంచి 'లక్ష' సాయం!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**



రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. నవంబర్ 19 నుంచి అర్హులైన యువతకు రూ.లక్ష వరకు స్వయం ఉపాధి ఆర్థిక సాయం అందించేలా చర్యలు స్పీడప్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలపై నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం కోసం కేంద్రీకృత వంటశాలలను వేగంగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ శిక్షణ, ఎస్సీ డిగ్రీ కాలేజీల్లో ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టు కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

# నాగోల్ గణపయ్య జల్వా..

## యాడ చూసినా ఇదే ముచ్చట!

- తెలంగాణలోనే అతి పెద్ద మట్టి వినాయకుడు
- 72 అడుగుల భారీ పర్యావరణ వినాయకుడి ఏర్పాటు
- హరిత సందేశంతో ఉత్సవ నిర్వహణ
- దర్శనం కోసం తరలివస్తున్న భక్తజనం
- యువత, చిన్నారులను ఆకట్టుకుంటున్న గణపయ్య
- భక్తి--సంప్రదాయంతో పాటు ప్రకృతి రక్షణకు ప్రాధాన్యం
- భక్తి ఏక్.. మెసేజ్ ఏక్.. ప్రకృతి బచావో!
- లుక్‌కు ఫిదా... సెల్ఫీల సందడి!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15: గణేశ్ ఉత్సవాల సందడి షురూ కాగా.. ఎల్బీనగర్--నాగోల్ ప్రాంతంలో శ్రీ అష్టసిద్ధి మహాగణపతి మండపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల భారీ పర్యావరణ వినాయకుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. భారీ రూపంలో కొలువుదీరిన గణపయ్యను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గణపయ్యను చూసిన భక్తులు "వాహ్ బొజ్జగణపయ్య.. క్యా బాత్ హై!" అంటూ మురిసిపోతున్నారు.**

**బొజ్జగణపయ్యే కాదు..**
**హరిత సందేశానికి బ్రాండ్ అంబాసిడర్!**

ఈ వినాయక విగ్రహం ప్రత్యేకత కేవలం భారీ ఆకారంలో ఉండటమే కాదు.. పర్యావరణ పరిరక్షణకు బలమైన సందేశాన్ని అందించడంలోనూ ఉంది. ప్రకృతికి నష్టం కలిగించే పదార్థాలకు దూరంగా పర్యావరణహిత విధానంలో గణపయ్యను రూపొందించడంపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

**గణపయ్య లుక్‌కు ఫిదా.. నాగోల్‌లో సెల్ఫీల సందడి!**

భారీ గణపయ్యను చూసేందుకు వచ్చే భక్తులు కుటుంబ సమేతంగా దర్శనం చేసుకుంటున్నారు. యువత, చిన్నారులు గణపయ్య రూపాన్ని తమ మొబైల్ కెమెరాల్లో బంధిస్తూ సందడి చేస్తున్నారు. దీంతో ఉత్సవ ప్రాంగణం భక్తి, సందడి, హరిత సందేశంతో కళకళలాడుతోంది. గణేష్ ఉత్సవాలు అంటే కేవలం భారీ విగ్రహాలు, డీజేలు, లైటింగులు మాత్రమే కాదని.. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. "గణపయ్యను ఘనంగా పూజిద్దాం.. ప్రకృతిని ప్రేమిద్దాం.. కాలుష్యాన్ని తగ్గిద్దాం" అంటూ ప్రజలకు పిలుపునిస్తున్నారు.

గణపయ్య దర్బార్‌లో హరిత హుకూం!నాగోల్‌లో కొలువుదీరిన ఈ పర్యావరణ గణపయ్య.. భక్తికి భక్తి, ప్రకృతికి ఇజ్జత్ అన్న కాన్సెప్ట్‌తో ఆకట్టుకుంటున్నాడు. పెద్ద విగ్రహం చూసేందుకు వచ్చే ప్రతి భక్తుడికి.. "పండుగ చేస్కో.. కానీ ప్రకృతిని పాడుచేయకు" అనే మెసేజ్ ఇస్తున్నాడు.



రష్యా ఆయిల్ కొంటే..అమెరికా టారిఫ్ బాంబ్..
**భారత్‌పై ప్రభావం ఎంత?**

**మీ వాయిస్‌నే క్లోన్ చేసి.. మీ కాల్స్‌నే హ్యాండిల్!**



## మహిళా కాంగ్రెస్ జోష్..

### గాంధీభవన్‌లో కేక్ కట్ చేసి 'జై మహిళా శక్తి'!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 15**




: హైదరాబాద్ గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణక్క మాట్లాడుతూ.. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడంలో మహిళా కాంగ్రెస్ కీలక భూమిక పోషిస్తోందన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యక్రమాల్లో మహిళా విభాగం యాక్టివ్‌గా పనిచేస్తోందని, ప్రజాపాలన సర్కార్ రావడంలోనూ మహిళా కాంగ్రెస్ పాత్ర ఉందన్నారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ 1984 సెప్టెంబర్ 15న మహిళా కాంగ్రెస్‌కు బీజం వేశారని గుర్తుచేశారు. మహిళల హక్కుల కోసం పోరాటం ఆగదన్నారు.

### గణపయ్యకు లావణ్యక్క 'దువా'..

## ఇంట్లనే పూజల సందడి!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 15:**



గోల్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ నల్లకుంటలోని తన నివాసంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంట్లో కొలువుదీరిన గణపయ్యకు కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. కుటుంబంతో కలిసి పండుగ సందడిని ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా 'గణపతి బప్పా మోరియా.. అందరి ఇంట్లో ఖుషీ, బరకత్ ఉండాలి' అంటూ ఆకాంక్షించారు. కుటుంబసభ్యులంతా కలిసి గణనాథుడికి పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఇంటి ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.




**సొంతింటి కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..**



**కొండా సురేఖ చాంబర్లకు తాళం..**




## బస్సులన్నీ టెర్మినల్ బాటే.. సిటీ ట్రాఫిక్‌కు 'ఫుల్ స్టాప్'!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్, పొల్యూషన్‌కు చెక్ పెట్టేందుకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. నగరానికి నలువైపులా గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ లో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్ణాటక, ఏపీ, మహారాష్ట్రతో పాటు ఓఆర్ఆర్ వైపు నుంచి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతరాష్ట్ర బస్సులను సిటీలోకి రానివ్వకుండా ఆయా టెర్మినల్స్ వరకే పరిమితం చేయనున్నారు. అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్‌తో లాస్ట్ మైల్ కనెక్టివిటీ కల్పించనున్నారు. ప్రైవేట్ బస్సుల ఇష్టారాజ్య పార్కింగ్‌కు కూడా చెక్ పెట్టి, టెర్మినల్స్ నుంచే నడిపించేలా నిబంధనలు తీసుకురానున్నారు.

## 22ఏలో 'గోల్‌మాల్'.. జ్యుడీషియల్ జడ్జిమెంట్ కావాలంటున్న కేటీఆర్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**



22ఏ అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరపాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు మూడేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. మూడేళ్లుగా సెటిల్‌మెంట్లు చేసుకుని ఇప్పుడు రెగ్యులరైజేషన్ పేరుతో హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చే ప్రతి స్కీమ్ వెనుక ఓ పెద్ద స్కామ్ ఉంటోందని కేటీఆర్ విమర్శించారు. 'భూభారతి' పేరుతో భూహారతి చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

22ఏ వ్యవహారంలో నిజానిజాలు బయటకు రావాలంటే న్యాయ విచారణ ఒక్కటే మార్గమని డిమాండ్ చేశారు. భూముల గోల్‌మాల్‌కు చెక్ పెట్టాలంటూ బీఆర్ఎస్ నేత డిమాండ్ చేయడంతో పొలిటికల్ హీట్ పెరిగింది.



### విమోచన దినం అధికారికంగా జరపాలె.. కలెక్టర్‌కు బీజేపీ 'వినతి'!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, సెప్టెంబర్ 15:**

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు తెలంగాణ సప్త సంకల్పాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించినట్లు జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సర్కార్ అధికారికంగా నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏడెల్లి అజయ్ కుమార్, ప్రేమ్ కుమార్, గడ్డం వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అధికార ప్రతినిధులు, జిల్లా నాయకులు, ఇతర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా... విమోచన దినం.. అధికారికంగా జరపాలె అంటూ బీజేపీ డిమాండ్‌తో హైదరాబాద్‌లో పొలిటికల్ హీట్ పెరిగింది.



### పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన జోష్..
### ఎల్లుండి 'జాతీయ' జల్సా!


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవం ఏర్పాట్లను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్ సర్కార్ విమోచన దినోత్సవం నిర్వహించడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వేడుకలు నిర్వహించలేదన్నారు. కేంద్రం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర పారామిలటరీ దళాల కవాతుతో పాటు తెలంగాణ కళాకారుల నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

## ఫలక్‌నుమాలో ఫ్యూచర్ ఫోకస్..

### మూసీ, హెరిటేజ్‌పై 'ఖాస్' చర్చ!


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**



హైదరాబాద్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ హెరిటేజ్ పరిరక్షణ, మూసీ రివైవల్, ఫ్యూచర్ సిటీ, గ్లోబల్ సమ్మిట్‌పై 'ఖాస్' చర్చ జరిగింది. అగా ఖాన్ ఫౌండేషన్ సేవలను సీఎం కొనియాడారు. కుతుబ్ షాహీ టూంబ్స్, శాసనమండలి భవనం పునరుద్ధరణలో ఫౌండేషన్ భాగస్వామ్యాన్ని గుర్తుచేశారు. సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి పాత భవనాల పునరుద్ధరణకు సహకరించాలని కోరారు. మూసీని నైట్ ఎకానమీకి అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు రహీమ్ అగా ఖాన్‌ను సీఎం ఆహ్వానించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దుతున్నామని, 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/
జనరల్ న్యూస్
మంగళవారం 15 సెప్టెంబర్ 2026


# ముడిచమురు మంట.. మార్కెట్ ధమాల్!



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**

ముడిచమురు ధరల పెరుగుదలతో మదుపర్లలో టెన్షన్ పెరిగి దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. చివరి గంటలో అమ్మకాలు జోరందుకోవడంతో సెన్సెక్స్ 777.94 పాయింట్లు కోల్పోయి 74,003.82 వద్ద, నిఫ్టీ 279.50 పాయింట్లు నష్టపోయి 23,118.60 వద్ద క్లోజయ్యాయి. నిఫ్టీ 23,300 కీలక స్థాయిని కోల్పోవడంతో ఇక 23,000పై అందరి నజర్. అది కూడా జారితే 22,800 వరకు పడిపోయే ఛాన్స్ ఉందంటున్నారు మార్కెట్ నిపుణులు. రియల్టీ షేర్లకు గట్టి దెబ్బ.. నిఫ్టీ రియల్టీ ఏకంగా 4 శాతం డౌన్. మిడ్‌క్యాప్ 2.12%, స్మాల్‌క్యాప్ 2.43% పడిపోయాయి. కెమికల్స్ కూడా ధమాల్ కాగా.. మార్కెట్ డౌన్‌లో ఉన్నా ఐటీ షేర్లు మాత్రం దాదాపు 2% లాభంతో దుమ్మురేపాయి.




# సొంతింటి కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.. పేదోళ్ల ముఖాన ఫుల్ చిరునవ్వు!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదోళ్లకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పీఎంఏవై కింద ఏపీ, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్టు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు దక్కనున్నాయి. దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నట్టు చెప్పారు. అర్హుల గుర్తింపులో 'ఆవాస్ ప్లస్' యాప్‌తో పారదర్శకత పాటిస్తామన్నారు. ఒక్కో ఇంటికి కేంద్రం నుంచి రూ.1.20 లక్షల ప్రాథమిక సాయం, అదనంగా రూ.1.80 లక్షల వరకు, మరుగుదొడ్డికి రూ.12 వేల సాయం అందుతుందని తెలిపారు. కొత్త ఇళ్లతోపాటు నిర్మాణంలో ఉన్నవన్నీ 2--3 ఏళ్లలో పూర్తి చేయడమే టార్గెట్ అన్నారు.



# కమీషన్ కా చక్కర్.. హోటల్ రూమ్‌లో మాల్వేర్ దందా!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15**

:కమీషన్ ఆశ చూపి బ్యాంకు ఖాతాదారులను హోటల్ రూముల్లో దాచేసి, వాళ్ల సెల్‌ఫోన్లలో మాల్వేర్ ఎక్కించి సైబర్ దందా నడిపిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును మియాపూర్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఫార్చ్యూన్ విస్టా హోటల్‌లో తనిఖీలు చేపట్టి వరంగల్‌కు చెందిన సామల హరికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ముఠా సభ్యులు ఖాతాదారులకు భారీ కమీషన్ ఆశ చూపి, 2--3 రోజులు హోటల్‌లో ఉంచి ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేయించేవారని పోలీసులు తెలిపారు. ఫోన్‌పై కంట్రోల్ తీసుకుని బ్యాంకు ఎస్ఎంఎస్ , ఓటీపీలు గమనిస్తూ సైబర్ నేరాల డబ్బును మ్యూల్ ఖాతాల నుంచి ఇతర ఖాతాలకు మళ్లించేవారట. ఖాతా ఇచ్చినందుకు కమీషన్‌గా నగదు, క్రిప్టో చెల్లించేవారు. ముఠా లీడర్ 'లవ్లీ'తో పాటు పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



# లోతుకుంట భూముల కేసులో సుప్రీం ట్విస్ట్.. 219 రోజులు లేటైతే పిటిషన్ ఔట్!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

నగరంలో సంచలనం రేపిన లోతుకుంట భూవివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కోర్టు తీర్పుపై అప్పీల్‌కు సాధారణంగా 90 రోజుల గడువు ఉంటే.. ఈ కేసులో ఏకంగా 219 రోజులకు అప్పీల్ దాఖలైందన్నారు. గడువు ముగిసినందునే సుప్రీంకోర్టు పిటిషన్‌ను కొట్టివేసిందని స్పష్టం చేశారు. లోతుకుంట భూములపై త్వరలోనే సమగ్ర సర్వే చేపడతామని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాతే భూముల అసలు లెక్క.. పూర్తి నిజం బయటపడుతుందని రంగనాథ్ వెల్లడించారు.

# కొండా సురేఖ చాంబర్లకు తాళం.. సెక్రటేరియట్‌లో సీల్ పంచ్!



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

తెలంగాణ సచివాలయంలో మాజీ మంత్రి కొండా సురేఖకు కేటాయించిన కార్యాలయ గదులకు అధికారులు సీల్ వేశారు. సెక్రటేరియట్ 4వ అంతస్తులోని 4ఎఫ్ విభాగంలో 10, 11, 12 నంబర్ గదులకు తాళాలు వేసి, సీల్ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మంత్రిగా కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం ఈ చాంబర్లను కొండా సురేఖకు కేటాయించింది. అయితే ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో.. అధికారులు ఆమెకు కేటాయించిన కార్యాలయాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో సెక్రటేరియట్‌లో కొండా సురేఖ చాంబర్లకు తాళం పడటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# మెయిల్ అంటే.. టెక్కీల గుండెల్లో గుబులు.. ఒరాకిల్‌లో మళ్లీ లేఆఫ్స్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15**

: టెక్ కంపెనీల్లో లేఆఫ్స్‌కు బ్రేక్ పడట్లే.. ఏఐ ఎంట్రీతో ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందోనని టెక్కీలు టెన్షన్ పడుతుంటే.. ఒరాకిల్‌లో మరో విడత కోతలు షురూ అయ్యాయి. ప్రభావిత ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే మెయిల్ పంపి.. అదే రోజు తమ చివరి వర్కింగ్ డే అని సమాచారం ఇచ్చినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ తెలిపింది. ఎంతమంది ఉద్యోగులు ప్రభావితమయ్యారన్నది ఒరాకిల్




అధికారికంగా వెల్లడించలేదు.

అయితే ఏఐ, క్లౌడ్ బిజినెస్ కోసం కంపెనీ భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో క్యాపెక్స్ ఏకంగా 28.5 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు ఈ ఏడాది ఇప్పటికే సుమారు 21 వేల ఉద్యోగాలను తగ్గించినట్లు సమాచారం. ఖర్చులు కంట్రోల్ చేస్తూనే.. ఏఐ క్లౌడ్‌పై దూకుడు పెంచుతున్న ఒరాకిల్ తీరు టెక్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



# ఉద్యోగులతో పెట్టుకుంటే.. అధికారం గల్లంతే! కవిత కిర్రాక్ కామెంట్స్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, సెప్టెంబర్ 15:**

ఉద్యోగులు, టీచర్లతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ పవర్‌లోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సదస్సులో కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా గుర్తించి గౌరవంగా పనిచేసే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 630 మండలాలకు కేవలం 8 మంది పర్మినెంట్ ఎంఈవోలు ఉండటం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. టీచర్లను రిపోర్టులు, డేటా పనుల్లో ముంచేస్తున్నారని విమర్శించారు. పీఆర్సీ, డీఏల హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు.

# ధరల మంట.. వడ్డీ రేట్లకు ఆర్‌బీఐ కత్తి!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**




ద్రవ్యోల్బణం దూసుకుపోతుండటంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపు సైకిల్ షురూ చేసే ఛాన్స్ ఉందని సిస్టమాటిక్స్ గ్రూప్ నివేదిక చెబుతోంది. అక్టోబర్ తొలి వారంలో జరిగే ఎంపీసీ భేటీలో దీనికి తొలి సంకేతాలు రావొచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం 5.25%గా ఉన్న రెపో రేటు క్రమంగా 6.5% వరకు చేరొచ్చని తెలిపింది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82%, ఆహార ద్రవ్యోల్బణం 5.95%కి పెరిగాయి. హోల్‌సేల్ ద్రవ్యోల్బణం కూడా 9.92%కి చేరింది. కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, ఇంధన ధరలే ధరల మంటకు ప్రధాన కారణాలంటోంది నివేదిక. ఇదే ట్రెండ్ కొనసాగితే అక్టోబర్-నవంబర్‌లో ద్రవ్యోల్బణం 6% దాటే ముప్పు ఉందని హెచ్చరించింది. అంటే సామాన్యుడికి ధరల షాక్.. లోన్లపై వడ్డీ ఝలక్..

# యూపీఐపై చార్జీల ముచ్చటా..?.. రాహుల్ గాంధీ ఫుల్ ఫైర్!



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**

యూపీఐ చెల్లింపులపై కేంద్రం తాజా నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ టార్గెట్ చేసింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రూ.2 వేలకుపైబడిన వ్యాపార యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించడం ద్వారా జీరో–చార్జీ విధానానికి గండి కొట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడికి కేంద్రం తలొగ్గుతోందని ప్రధాని మోదీపై విమర్శలు చేశారు. యూపీఐపై కస్టమర్ల నుంచి నేరుగా ఫీజు వసూలు చేయకపోయినా.. వ్యాపారులపై పడే చార్జీలు చివరికి వస్తువుల ధరల రూపంలో వినియోగదారుల జేబుకే భారమవుతాయని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# రష్యా ఆయిల్ కొంటే..అమెరికా టారిఫ్ బాంబ్..భారత్‌పై ప్రభావం ఎంత?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**



రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలకు అమెరికా భారీ షాక్ ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'లో భాగంగా సెనేట్‌లో ప్రవేశపెట్టిన సవరణలో.. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసే టాప్-5 దేశాలపై 100% వరకు అదనపు టారిఫ్ విధించే అవకాశం కల్పించారు. ఈ జాబితాలో భారత్, చైనా ఉండే ఛాన్స్ ఉండటంతో టెన్షన్ పెరిగింది. అయితే భారత్‌పై వెంటనే 100% సుంకం పడుతుందని కాదు. 0--100% మధ్య రేటును అమెరికా అధ్యక్షుడు నిర్ణయించే అవకాశం ఉంది. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించే దేశాలకు సుంకం తగ్గించే వెసులుబాటు కూడా ఉంది. అంటే రష్యా ఆయిల్ కొనుగోలు చేస్తే.. అమెరికా మార్కెట్‌లో టారిఫ్ కత్తి వేలాడుతుందన్నమాట..



## హౌతీల దాడులతో సౌదీలో కలకలం..

# ప్రజలకు ఎమర్జెన్సీ వార్నింగ్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**

పశ్చిమాసియాలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరాన్ మద్దతున్న హౌతీలు సౌదీ అరేబియాపై దాడులు ఉధృతం చేయడంతో అక్కడి ప్రభుత్వం పౌరులకు అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ప్రజలు వంతెనలు, ఎత్తైన భవనాలు, బాల్కనీలు, గాజు కిటికీలు, ఇంటి పైకప్పులకు దూరంగా ఉండాలని సూచించింది. సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండి, కిటికీలకు దూరంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరింది. బయట ఉన్నవారు వెంటనే సమీప భవనాల్లో ఆశ్రయం పొందాలని తెలిపింది. హౌతీల దాడులను సౌదీ కేబినెట్ తీవ్రంగా ఖండిస్తూ.. దేశ భద్రత, భూభాగ పరిరక్షణ విషయంలో రాజీపడబోమని స్పష్టం చేసింది. ముస్లింలకు పవిత్ర నగరమైన మక్కా ఉన్న నేపథ్యంలో సౌదీ ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది.

## చిప్పుల దునియాలో ఇండియా దూకుడు..

# ఎలక్ట్రానిక్స్‌తో పక్కా పునాది!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**




గత దశాబ్దంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ దుమ్మురేపింది. 2014-15లో రూ.1.9 లక్షల కోట్లుగా ఉన్న ఉత్పత్తి.. 2025-26 నాటికి రూ.13.11 లక్షల కోట్లకు చేరింది. మొబైల్ తయారీ రూ.18 వేల కోట్ల నుంచి రూ.6.27 లక్షల కోట్లకు, ఎగుమతులు రూ.1,500 కోట్ల నుంచి రూ.2.59 లక్షల కోట్లకు పెరిగాయి. దేశంలో వినియోగిస్తున్న మొబైళ్లలో 99.2 శాతం స్థానికంగానే తయారవుతున్నాయి. సెమికాన్ 1.0కు రూ.76 వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. సెమికాన్ 2.0కు మరో రూ.1.27 లక్షల కోట్లు సమకూర్చింది. ఆరు రాష్ట్రాల్లో 12 ప్రాజెక్టులు ఆమోదం పొందగా.. మూడు ప్లాంట్లలో వాణిజ్య ఉత్పత్తి మొదలైంది. ఇక చిప్ డిజైన్, ఏఐ, స్టార్టప్‌లపై ఫోకస్ పెడుతూ.. గ్లోబల్ సెమీకండక్టర్ సప్లై చైన్‌లో భారత్ తన ముద్ర వేస్తోంది.

ట్రెండింగ్, క్రైం

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

జనరల్ న్యూస్ | చూసి ముర్వాలే | మంగళవారం 15 సెప్టెంబర్ 2026



# బిగ్‌బాస్‌లో కెప్టెన్సీ ఫైట్.. బెలూన్లు పగిలితే గోలే గోల!




**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:**

నిన్న నామినేషన్స్ పర్వం హాట్‌హాట్‌గా సాగగా.. తాజాగా నేటి ప్రోమో రిలీజ్ అయింది. ఇందులో కెప్టెన్సీ కోసం కంటెస్టెంట్ల మధ్య పోటీ జరగనున్నట్లు తెలుస్తోంది. 'పవర్ ఆఫ్ పీపుల్' అవతారంలో బిగ్‌బాస్ ఈ టాస్క్ నిర్వహిస్తున్నాడు. కెప్టెన్‌గా ఎవరు ఉండాలో ప్రజలే కొంతమందిని ఎంపిక చేసినా.. కెప్టెన్ కావాలంటే పోరాటం మీరే చేయాలని బిగ్‌బాస్ స్పష్టం చేశాడు. స్పెల్లింగ్ కరెక్ట్ చేసే టాస్క్‌లో వేగంగా పూర్తి చేసిన వారికి బెలూన్ పగలగొట్టి.. ప్రత్యర్థి కెప్టెన్ ఎందుకు కాకూడదో కారణాలు చెప్పాలని సూచించాడు. త్రిగుణ్, రోహిత్, దేబ్జానీ, ముకేశ్, షాలిని, ఝాన్సీ, అమన్ ఈ పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. వర్షిణి సంచాలకురాలిగా తీసుకున్న ఓ నిర్ణయంపై షాలిని మరోసారి గొడవకు దిగింది. ఝాన్సీ కూడా రోహిత్‌పై ఫైర్ అయింది. మరి కెప్టెన్ ఎవరో తెలియాలంటే రాత్రి ఎపిసోడ్ వరకు ఆగాల్సిందే.



# బ్లాక్ బ్యూటీకి బజ్.. సారా లుక్ అదుర్స్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:** క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కూతురు సారా టెండూల్కర్ తన తాజా ఫోటోషూట్‌తో నెట్టింట ఫుల్ బజ్ తెచ్చుకుంది. బ్లాక్ సీక్విన్ డ్రెస్‌లో అప్రయత్నమైన ఎలిగెన్స్‌తో అదరగొట్టింది. బ్యాక్ ఓపెన్ డిజైన్, సున్నితమైన డీటెయిలింగ్‌తో స్టైలిష్ లుక్‌లో కెమెరాకు హుందాగా పోజిచ్చింది. భుజం మీదుగా వెనక్కి తిరిగి ఇచ్చిన పోజ్ ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. సారా కొత్త లుక్ చూసి నెటిజన్లు "వాహ్.. క్యా స్టైల్ హై!" అంటూ కామెంట్లతో హంగామా చేస్తున్నారు.

# నుష్రత్ లుక్.. గ్లామర్‌కు గిర్రున గేర్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:**

బాలీవుడ్ భామ నుష్రత్ భరూచా కొత్త అవతార్‌తో నెట్టింట సందడి చేసింది. వైట్ లేస్-అప్ కార్సెట్ టాప్‌కు ఆలివ్ గ్రీన్ వైడ్-లెగ్ ప్యాంట్ జోడించి స్టైలిష్‌గా దర్శనమిచ్చింది.

ఇండోర్ ఫోటోషూట్‌లో కాన్ఫిడెన్స్‌తో ఇచ్చిన పోజులు అదుర్స్ అనిపించాయి. సింపుల్ స్టైల్‌కు గ్లామర్ టచ్ ఇచ్చి.. "వాహ్ భాయ్.. క్యా లుక్ హై!" అనిపించేలా నెటిజన్ల దృష్టిని ఆకట్టుకుంది.





# రంగుల రాణి జాన్వీ.. లెహంగా లుక్‌లో రాజసం!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:**

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ రంగురంగుల లెహంగా లుక్‌తో నెట్టింట ఫుల్ హంగామా చేసింది. గాఢమైన ఎరుపు బ్యాక్‌డ్రాప్ ముందు నీలం, గులాబీ, ఎరుపు ఛాయల ఎంబ్రాయిడరీ లెహంగాలో హుందాగా పోజులిచ్చింది. పైస్లీ, పూల మోటిఫ్‌లతో డిజైన్ చేసిన డ్రెస్‌లో జాన్వీ లుక్ అదుర్స్ అనిపించింది. ట్రెడిషనల్ స్టైల్‌కు మోడ్రన్ టచ్ జోడి అనిపించేలా మెరిసింది.

# రాజు కేసులో ఆడియో కలకలం.. రూ.5 లక్షలతో సెటిల్‌మెంట్ టాక్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:**

'ఢీ' విన్నర్ రాజు లైంగిక వేధింపుల కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ యువతితో రాజు మాట్లాడినట్లుగా చెబుతున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో "ఇక ఫ్రెండ్స్‌గానే ఉందాం.. రూ.5 లక్షలు ఇస్తా.. నన్ను వదిలేయ్" అంటూ రాజు కోరుతున్నట్లు వినిపిస్తోంది. మరోవైపు యువతి మాత్రం తనతోనే ఉండాలని కోరుతూ కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఆడియోలో ఉంది. "మరో అమ్మాయి కోసం నన్ను వదిలేస్తున్నావా?" అంటూ నిలదీసినట్లు తెలుస్తోంది. ఈ ఆడియోపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చ జోరుగా సాగుతోంది. అయితే వైరల్ అవుతున్న ఆడియో నిజమైనదేనా? అందులో మాట్లాడింది ఎవరనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.



# 15 ఏండ్ల వెయిటింగ్.. జక్కన్నతో మహేష్ 'వారణాసి'!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, సెప్టెంబర్ 15:**



సూపర్‌స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో వస్తున్న 'వారణాసి'పై ఫ్యాన్స్‌లో ఫుల్ క్రేజ్ నెలకొంది. తాజాగా ఓ విదేశీ పాడ్‌కాస్ట్‌లో మహేష్ ఆసక్తికర సంగతులు పంచుకున్నారు. 'మగధీర' తర్వాతే రాజమౌళిని కలిసి సినిమా చేద్దామని అడిగానని, తన చేతిలో రెండు సినిమాలు ఉన్నాయని అవి పూర్తయ్యాక ప్రాజెక్ట్ చేద్దామని జక్కన్న చెప్పారని తెలిపారు. ఆ రెండు సినిమాలు కంప్లీట్ కావడానికి ఏకంగా 15 ఏళ్లు పట్టిందన్నారు. రాజమౌళితో పనిచేయడం కష్టం అంటూ కొందరు భయపెట్టినా.. ఆయన ప్లానింగ్, రిహార్సల్స్ వల్ల షూటింగ్ చాలా ఈజీగా, ఫన్‌గా సాగుతోందని మహేష్ చెప్పుకొచ్చారు. "ఇక వేరే డైరెక్టర్లతో పనిచేయడం కష్టమే" అంటూ సరదాగా కామెంట్ చేశారు.

# రసగుల్లా తింటే.. విషాదమే మిగిలే!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**



బీహార్ బోధ్‌గయాలో దారుణ విషాదం చోటుచేసుకుంది. సోనూ బిఘా గ్రామానికి చెందిన 8 ఏళ్ల శివమ్ కుమార్ రసగుల్లా గొంతులో ఇరుక్కుని మృతి చెందాడు. ఆదివారం రాత్రి ఇంట్లో రసగుల్లా తింటూ.. ఆ తర్వాత పరుగెత్తుతుండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో మిఠాయి గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడం కష్టమైంది. కుటుంబ సభ్యులు వెంటనే బోధ్‌గయా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో మగధ మెడికల్ కాలేజీకి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే ఆస్పత్రికి తరలిస్తుండగానే బాలుడు కన్నుమూశాడు. చిన్నారి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. పిల్లలు తినేటప్పుడు పరుగులు, ఆటలు చేయకుండా పెద్దలు పర్యవేక్షించాలని వైద్యులు సూచిస్తున్నారు.



# మీ వాయిస్‌నే క్లోన్ చేసి.. మీ కాల్స్‌నే హ్యాండిల్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**

ఏఐ దునియాలో మరో సూపర్ టెక్నాలజీ ఎంట్రీ ఇచ్చింది. 'ఫైర్‌ఫ్లైస్' సంస్థ తెచ్చిన ఏఐ వాయిస్ ఏజెంట్ ఇక మీ బదులు ఫోన్ కాల్స్ హ్యాండిల్ చేయనుంది. మొబైల్‌లో యాప్ ఇన్‌స్టాల్ అవసరం లేకుండా లింక్, క్యూఆర్ కోడ్ లేదా వెబ్‌సైట్ ద్వారా దీనిని యాక్సెస్ చేయొచ్చు. అంతేకాదు.. కేవలం 30 సెకన్లలో మీ వాయిస్‌ను క్లోన్ చేసి, అచ్చం మీలాగే మాట్లాడే సామర్థ్యం ఉందని సంస్థ చెబుతోంది. 30కి పైగా భాషల్లో మాట్లాడగల ఈ ఏజెంట్.. కస్టమర్ సపోర్ట్, సేల్స్, ఉద్యోగ ఇంటర్వ్యూ స్క్రీనింగ్ వంటి పనులు కూడా చేస్తుందట. కాల్ తర్వాత సీఆర్ఎం, ఏటీఎస్ అప్‌డేట్లు, ఫాలోఅప్స్ కూడా ఆటోమేటిక్‌గా పూర్తి చేస్తుంది. అయితే వాయిస్ క్లోనింగ్‌తో ప్రైవసీ, ఆథెంటికేషన్ జాగ్రత్తలు తప్పనిసరి అంటున్నారు నిపుణులు.



# అజార్‌పై పాక్ యాక్షన్..

## రివార్డు పెంపుతో హైడ్రామా!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, సెప్టెంబర్ 15:**

ఉగ్రవాదంపై యాక్షన్ తీసుకుంటున్నామంటున్న పాకిస్థాన్.. జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌పై రివార్డు పెంచింది. ఎఫ్ఐఏ విడుదల చేసిన 2026 'రెడ్‌బుక్'లో అజార్‌ను పరారీలో ఉన్న ఉగ్రవాదిగా పేర్కొంటూ.. అతడిని పట్టుకునే రివార్డును రూ.70 లక్షల పాకిస్థానీ కరెన్సీకి పెంచింది. అజార్ పాక్‌లోనే ఉన్నాడన్న వాదనలు ఒకవైపు.. ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాడని పాక్ చెబుతుండటం మరోవైపు చర్చనీయాంశంగా మారింది.

26/11 ముంబై దాడులతో సంబంధం ఉన్న పలువురి పేర్లు కూడా రెడ్‌బుక్‌లో ఉన్నట్లు కథనాలు చెబుతున్నాయి. అక్టోబర్ సమీక్షకు ముందు పాక్ తన ఉగ్రవాద వ్యతిరేక చర్యలను చూపించే ప్రయత్నమేనా? అన్న చర్చ నడుస్తోంది. అసలు యాక్షన్ ఎంతవరకు ఉంటుందో చూడాలె..

ON BEHALFOF RRR MEDIA PVT LIMITED ..2-3-606/49/4.. PATELNAGER.. AMBER PET, HYDERABAD, TELNGANA.. 500013,
EDITOR: RAMANRAJU RATHNA, RNI NO TG/2024/1093.. email:ramannews9@gmail.com..phon 9949152838, 7013794396